- ‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

- పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ | ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

సౌరశక్తి ఉత్పత్తితో రైతులు ఆదాయం పొందొచ్చు

మహబూబాబాద్ రూరల్ : రైతులు తమ బంజర భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందవచ్చునని మానుకోట సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ నరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ ప్లాంట్ పెట్టుకోవడానికి ఆసక్తి ఉన్న వారు స్వయం సహాయక బృందాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ పథకం గురించి మరిన్ని వివరాల కోసం 9000550974 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విరాళం అందజేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

గంగమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు

చిన్నగూడూరు, జనవరి 31 : మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయం ఇటీవల ఆకేరు వాగు ఉధృతికి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో మండల కేంద్రానికి చెందిన యాదవ సంఘం నాయకులు గుడి పునర్నిర్మాణానికి దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో వైద్యుడిగా పనిచేస్తున్న మండల కేంద్రానికి చెందిన డాక్టర్ రాంపెల్లి విజయ్‌కుమార్ రూ.50వేలు, గ్రామానికి చెందిన రావుల రంగారెడ్డి రూ.50వేలు, కమలాకర్ రూ.లక్ష, గోపగాని మల్లేశ్ రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు వెంకన్న, నర్సయ్య, మల్లయ్య, యలమంద, పాపయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఏడీఈగా అజయ్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న అజయ్

మరిపెడ, జనవరి 31: మరిపెడ ఏడీఈగా అజయ్ శుక్రవారం విధుల్లో చేరారు. మరిపెడ సబ్ డివిజన్ కార్యాలయంలో తొర్రూరు డీఈ మధుసూదన్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. విద్యుత్ శాఖలో సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడి ఏడీఈ లోక్‌నాథ్‌రెడ్డి నిజామాబాద్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. మరిపెడ మండలం ఎల్లంపేట ఏఈగా పనిచేస్తున్న అజయ్‌కి మరిపెడ ఏడీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయనకు మరిపెడ, చిన్న గూడూరు ఏఈలు పావని, నవ్య, ఎస్ఈలు మహముద్, రూబీనా శుభాకాంక్షలు తెలిపారు.

108 అంబులెన్స్ తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ మహేష్

కురవి, జనవరి 31 : మండల కేంద్రంలో 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా కోఆర్డినేటర్ బత్తిని మహేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలో పలు రికార్డులను పరిశీలించారు. మందులు ఎప్పటికప్పుడు చూసుకోవాలని, ప్రమాద బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట ఈఎంటీ దాసరి వెంకన్న, పైలెట్ జక్కుల వీరన్న ఉన్నారు.

కురవి : గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

దంతాలపల్లి : పాఠశాలలో విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో శ్రీదేవి

డోర్నకల్ : విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంఈవో లక్ష్మి, ఉపాధ్యాయుడు రాజేశ్వర్

విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

కురవి/దంతాలపల్లి/డోర్నకల్/చిన్నగూడూరు, జనవరి 31 : నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పదోతరగతి విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. కురవి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వాహిద్, మండల ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కన్వీనర్ శ్రీధర్ సమక్షంలో పరీక్ష జరిగింది. ప్రతిభ కనబరిచిన బీ కల్యాణి, డీ శివ, ఎన్ జశ్వంత్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్లు బీవీ ప్రసాద్, దామోదర్, మాధవాచారి, వీరన్న, మాధవి, మహేశ్ పాల్గొన్నారు. అలాగే, దంతాలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. దాట్ల పాఠశాలకు చెందిన విద్యార్థి రాము ప్రథమస్థానం సాధించగా ఎంజేపీ విద్యార్థి ఉదయ్‌కుమార్, జడ్పీహెచ్ఎస్ దంతాలపల్లి విద్యార్థిని జోత్స్న ప్రతిభ కనబరిచారు. ఇన్‌చార్జి ఎంఈవో శ్రీదేవి వారికి జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీదేవి, శంకరయ్య పాల్గొన్నారు. డోర్నకల్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన టాలెంట్ టెస్ట్‌లో పథమ బహుమతి జీ మహేశ్(జడ్పీహెచ్ఎస్ ముల్కలపల్లి), ద్వితీయ బహుమతి ఎస్ పూజిత(జడ్పీహెచ్ఎస్ డోర్నకల్), తృతీయ బహుమతి సీహెచ్ జశ్వంత్(జడ్పీహెచ్ఎస్ ముల్కలపల్లి) సాధించారు. వారికి ఎంఈవో ఆంగోత్ లక్ష్మి బహుమతులు అందజేశారు. సైన్స్ టాలెంట్ టెస్టు ఇన్‌చార్జి కే రాజేశ్వర్, హెచ్ఎం బండి నరసింహారావు, ఉపాధ్యాయులు జీటీ రమేశ్, అరుణ, మంజులత, శంకర్, వసంత రాణి పాల్గొన్నారు. చిన్నగూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలో లక్ష్మణ్ ప్రథమ, దేవీప్రియ ద్వితీయ, నసీఫ్ తృతీయ స్థానంలో నిలిచారు. ఇన్‌చార్జి హెచ్ఎం రహమాన్ వారిని అభినందించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈ నెల 4న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

బీసీ సభకు ముదిరాజ్‌లు భారీగా తరలివెళ్లాలి

బీసీ యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నాయకులు

తొర్రూరు, జనవరి 31 : వరంగల్ నగరంలో ఫిబ్రవరి 2న జరిగే బీసీ సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో హాజరుకావాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల సోమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో బీసీ రాజకీయ యుద్ధభేరి ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గంధం చంద్రమూర్తి, దంతాలపల్లి ప్రధాన కార్యదర్శి సాదు రాములు, తొర్రూరు గౌరవ సలహాదారులు కొండా వెంకన్న, చెర్లపాలెం సొసైటీ సెక్రటరీ పులుగుజ్జ మహేశ్, నాయకులు పులుగుజ్జ రాంచంద్రు, కాగు నవీన్, గుంటుక వెంకటేశ్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

రైల్వే ఇనిస్టిట్యూట్ అభివృద్ధికి కృషి

రిటైర్డ్ రైల్వే కార్మికులతో క్యారమ్ ఆడుతున్న డిప్యూటీ సీపీవో జయశంకర్ చౌహాన్

కాజీపేట, జవనరి 31 : కాజీపేటలోని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని డిప్యూటీ సీపీవో, వెల్ఫేర్ జయశంకర్ చౌహాన్ అన్నారు. రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌ను రైల్వే అధికారులు శుక్రవారం తనిఖీ చే శారు. ఆఫీస్ రిజిస్టర్, కమ్యూనిటీ హాల్ బుకింగ్ విధానాన్ని పరిశీలించారు. బిలియర్డ్స్, చెస్, క్యారమ్స్, టే బుల్ టెన్నిస్, జిమ్, గ్రంథాలయం, పాత భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ స్టాఫ్ బెనిఫిట్ ఫండ్ నిధులను ఇనిస్టిట్యూట్‌కు కే టాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రైల్వే ఏపీవో ఆర్‌వీఆస్ఆర్‌కే ప్రసాద్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు సరళ, మాధవి, సంధ్య, ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ రాజ య్య, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు ఉన్నారు.

420 హామీలు అమలు చేయాలి

నర్సింహులపేట, జనవరి 31 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ దంతాలపల్లి ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి చిర్ర యాకయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 20న ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం మండలంలోని పడమటిగూడెంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు రైతు భరోసా,ఇండ్లు, పింఛన్లు అందించాలన్నారు. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో యాకమ్మ, లక్ష్మి, సుగుణమ్మ, సాయిలు, రమేశ్, మల్లమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో ఏసీపీలకు పతకాలు

సుబేదారి, జనవరి 31 : కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థా యి పోలీసు క్రీడల్లో వరంగల్ పోలీసు కమిషనరేట్ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, అనంతయ్య రాణించారు. బ్యాడ్మింటన్ క్రీడలో 55 ఏళ్ల డబుల్స్ విభాగంలో జితేందర్‌రెడ్డి-మధుసూదన్ జోడీ బంగారు పతకం గెలుచుకున్నారు. 50 ఏళ్లవిభాగంలో జితేందర్‌రెడ్డి-అనంతయ్య రజతం, టేబుల్ టెన్నిస్‌లో మధుసూదన్, అనంతయ్య కాంస్యం గెలుచుకున్నారు. వారిని సీపీ అభినందించారు.

జాతీయ క్రీడలకు ఎల్బీ విద్యార్థిని

హనుమకొండ చౌరస్తా, జనవరి 31 : ఉత్తరాఖండ్‌లో ఈ నెల 7 నుంచి 12 వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు ఎల్బీ కాలేజీ విద్యార్థి ధనుర్కర్ శాలిని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. తెలంగాణ జట్టు తరుపున నెట్‌బాల్ క్రీడలో ఆమె ప్రాతినిధ్యం వహిస్తుంది. శాలినిని కాలేజీ చైర్మన్ భాగ్యనారాయణ, వినయ్‌కుమార్ అభినందించారు.

పెళ్లి వేడుకలో ఘర్షణ

- బంతి భోజనం వద్ద లొల్లి
- చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులపై తిరుగుబాటు
- నలుగురిపై కేసు నమోదు

పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తున్న యువకులు

కురవి, జనవరి 31 : పెళ్లి వేడుకలో జరిగిన చిన్నపాటి గొడవ పోలీస్ కేసు దాకా వెళ్లింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కేసముద్రం మండలం రేకులతండా అబ్బాయికి డోర్నకల్ మండలం వెన్నారం శివారు రాముతండా అమ్మాయితో కురవి ఆలయంలో శుక్రవారం వివాహమైంది. పెళ్లి తర్వాత ఆయన పరిసరాల్లోని ప్రైవేట్ అద్దె గదిలో బంతి భోజనం ఏర్పాటు చేశారు. భోజనం విషయంలో వధూవరులి ద్దరు తరపు బంధువులు ఘర్షణ పడ్డారు. సమాచారం పోలీసులకు చేరడంతో కురవి ఎఎస్సైలు సదయ్య, వెంకన్నలు చేరుకుని సముదాయించేందుకు ప్రయత్నించారు. అయినా వినకుండా పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో లాఠీలతో చెదరగొట్టి యువకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తారాచంద్‌ను సన్మానిస్తున్న సీఐ గణేశ్, ఎస్సై ఉపేందర్

ఏఎస్సై తారాచంద్‌కు సన్మానం

తొర్రూరు, జనవరి 31 : ఏఎస్సై తారచంద్ సేవలు మరువలేనివని తొర్రూరు డివిజన్ సీఐ గణేశ్ అన్నారు. తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తించిన తారాచంద్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సీఐ గణేశ్, ఎస్ఐ ఉపేందర్ ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాంజీ నాయక్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ నేషనల్ క్యాంపునకు పద్మ ఎంపిక

పద్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

న్యూశాయంపేట, జనవరి 31 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మంగళపల్లి పద్మ ఎన్ఎస్ఎస్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపిక కావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ గోలి శ్రీలత అన్నారు. నగరంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ కళాశాల ఆవరణలో శుక్రవారం పద్మను ఆమెతో పాటు అధ్యాపకులు అభినందించారు. బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న పద్మ ఫిబ్రవరి 3 నుంచి 9వ తేదీ వరకు వెస్ట్ గోదావరి జిల్లాలోని నర్సాపూర్ వైఎన్ కళాశాలలో జరిగే శిక్షణలో పాల్గొంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాధిక, శిరీష పాల్గొన్నారు.